రాజకీయ రహితంగా పట్టణాభివృద్ధి

- మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి
- కొవ్వూరు మున్సిపల్ సాధారణ, అత్యవసర సమావేశాలు



కొవ్వూరు మునిసిపల్ కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశానికి హాజరైన సభ్యులు



మాట్లాడుతున్న చైర్ పర్సన్ బావన రత్నకుమారి

కొవ్వూరు: పట్టణాభివృద్ధిని రాజకీయ పార్టీల కోణంలో ఎక్కడా చూడడం లేదని, ప్రాధాన్యతా క్రమంలోనే పనులను చేయిస్తున్నామని మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. కొవ్వూరు మునిసిపల్ కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలు చైర్‌పర్సన్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నకుమారి మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలో రూ.40.68 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలని కోరుతూ ఇటీవల కొవ్వూరు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరుతూ ప్రతిపాదనలను సమర్పించామన్నారు. అవిశ్రాంతంగా పని చేసి ముఖ్యమంత్రి బహిరంగ సభను విజయవంతం చేసిన మునిసిపల్ కమిషనర్, ఇతర అధికారులు, సిబ్బందిని ఆమె అభినందించారు. బీజేపీ కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ మాట్లాడుతూ తన వార్డులో ఎత్తుగా ఉన్న కల్వర్టును సరిచేయించాలని కోరారు. మౌలిక సదుపాయాల కల్పనకు మున్సిపాలిటీ దృష్టి సారించాలన్నారు. విపక్ష సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డుల అభివృద్ధికి తగినన్ని నిధులు కేటాయించాలని కోరారు. దీనిపై వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ బత్తి నాగరాజు స్పందిస్తూ పట్టణాభివృద్ధి విషయంలో ఎక్కడా వివక్ష చూపడం లేదన్నారు. టీడీపీ కౌన్సిలర్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఇందిరమ్మ కాలనీలో రూ.45 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్డు నిర్మించామన్నారు. 23వ వార్డులో రూ.35 లక్షలతో సిమెంట్ రోడ్డు వేశామన్నారు. తన వార్డులో 4 డ్రెయిన్లు నిర్మించాలని కోరుతుంటే ఒక్కటి మాత్రమే మంజూరు చేశారని 12వ వార్డు కౌన్సిలర్ అంకోలు లిల్లీ వెంకట పద్మలీల ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పనులు కూడా ఎప్పటి ప్రారంభిస్తారని ఆమె ప్రశ్నించారు. టెండర్లు పిలిచిన 15 రోజులలోగా కాంట్రాక్టర్ పనులు ప్రారంభించకుంటే నోటీసులు ఇవ్వాలని చైర్ పర్సన్ రత్నకుమారి ఆదేశించారు.

32 అంశాల ఆమోదం

మున్సిపల్ సాధారణ సమావేశంలో 14, అత్యవసర సమావేశంలో ప్రతిపాదించిన 18 అంశాలకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.15వ ఆర్థిక సంఘం నిధులతో మెయిన్ రోడ్డు, ఈజీకే రోడ్డులోని డివైడర్లను అభివృద్ధి చేయాలని తీర్మానించారు. రూ.40 లక్షల వ్య యంతో 11,12 వార్డుల్లో బీటీ రోడ్లకు ఆమోదం తెలిపారు. అర్బన్ హెల్త్ సెంటర్‌లో అదనపు పనుల కోసం నిధులు కేటాయించారు. ప్రజారోగ్య, పారిశుధ్య విభాగం పనులకు రూ.10లక్షలు కేటాయించారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్ నిధులతో వివిధ వార్డుల్లో పైప్ లైన్ల ఏర్పాటుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మూడో వార్డులో కల్వర్టు, ఆరో వార్డులో సీసీ కల్వర్టు, 22వ వార్డులో సీసీ డ్రెయిన్, హెచ్‌పీ గ్యాస్ కంపెనీ సమీపంలో సీసీ కల్వర్టు నిర్మాణానికి ఆమోదం తెలిపింది. అలాగే 12వ వార్డులో సీసీ డ్రెయిన్, కొంగల బాడవ అవుట్ పాల్ డ్రెయిన్ పూడిక తీత పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఐదో వార్డులో సీసీ డ్రెయిన్,14వ వార్డులో సీసీ కల్వర్టు, 21వ వార్డులో సీసీ డ్రెయిన్, 20వ వార్డులో సిమెంటు రోడ్డు నిర్మాణానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

జగన్‌తోనే సంక్షేమ పాలన సాధ్యం

- కోరుమామిడి అభివృద్ధికి అండగా ఉంటా
- ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- భారీ తాగునీటి పథకానికి శంకుస్థాపన



తాగునీటి పథకం శంకుస్థాపన శిలా ఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: రాష్ట్రంలో సంక్షేమ పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని కోరుమామిడి గ్రామంలో నిర్మించే ఓహెచ్‌ఎస్ఆర్ ట్యాంకుకు, తాగునీటి కుళాయిలకు, పైపులైన్ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేసి శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా రూ.44.17 లక్షల వ్యయంతో ఈ తాగునీటి పథకాన్ని చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా కోరుమామిడి గ్రామస్తులకు రూ.38 కోట్ల విలువైన వివిధ సంక్షేమ పథకాలు అందించామన్నారు. అలాగే రూ.4 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేశామన్నారు. సమస్య ఏదైనా తాను అండగా ఉంటానని, కోరుమామిడి గ్రామాభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానన్నారు. పేదల ఇళ్ల స్థలాలుగా పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన భూమి కొనుగోలు ప్రక్రియను టీడీపీ గ్రామ నాయకులు అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. గత ప్రభుత్వం హయాంలో సెంటు భూమిని కూడా పేదలకు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ కానుబోయిన ప్రభావతి, సర్పంచ్ అంబటి గోపమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు వరిగేటి సౌజన్య, సచివాలయ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు కానుబోయిన శేషు, ఉప్పల కాశీ, రాపాక వెంకట్రావు, ఎంపీడీఓ టి.మూర్తిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ టి.శ్రీనివాస్‌బాబు, ఏఈ కె.శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాలతో క్లీన్ నిడదవోలు

నిడదవోలు: ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాల ద్వారా పట్టణాన్ని క్లీన్ నిడదవోలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టినట్టు మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి అన్నారు. స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో మేరీ లైఫ్ మేరా సహర్ నినాదంతో శనివారం పట్టణంలోని 13 సచివాలయాల పరిధిలోని 21 ప్రాంతాల్లో రెడ్యూజ్, రీ యూజ్, రీ సైక్లింగ్ (ఆర్‌ఆర్‌ఆర్) కేంద్రాల ద్వారా గృహాల్లోని వ్యర్థాలు, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్ళల్లోంచి పాత దుస్తులు, పాత సామాన్లు, ఎలక్ట్రికల్ వస్తువులు, దుప్పట్లు, పాదరక్షలు, పరుపులు, ప్లాస్టిక్ వస్తువుల వంటి వాటిని సేకరించారు.వాటిలో పనికి వచ్చే వస్తువులను ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాల ద్వారా అవసరమైన వారికి అందిస్తారు. ఉపయోగపడని పాత వస్తువులను రీ సైక్లింగ్‌కు పంపిస్తారు. ఈ విధంగా సేకరించి, వినియోగించని నాలుగు టన్నుల పాత వస్తువులను గుంటూరులోని సిందాల్ పవర్ ప్లాంట్‌కు పంపించినట్లు కమిషనర్ పద్మావతి చెప్పారు. కార్యక్రమంలో పట్టణ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ఉదయ్‌కుమార్, సచివాలయ పారిశుధ్య కార్యదర్శులు, పర్యావరణ కార్యదర్శులు పాల్గొన్నారు.

27ఎన్‌డీడీ 01 పట్టణంలో పాత వస్తువులు సేకరిస్తున్న సచివాలయ పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులు

పట్టుబడిన వాహనాలకు రేపు వేలం

దేవరపల్లి: స్థానిక ఎస్‌ఈబీ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను సోమవారం స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం వేస్తున్నట్టు సీఐ దిమ్మల సుధ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో వేలం జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొన దలచిన వారు ఆధార్ కార్డు, రూ.5000 ధరావత్తు చెల్లించాలన్నారు. వేలంలో వాహనాలను దక్కించుకున్న వారు అదే రోజు వేలం సొమ్ముతో పాటు జీఎస్టీ కలిపి చెల్లించాలని ఆమె తెలిపారు. వివరాల కొరకు స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

5న నిడదవోలులో..

నిడదవోలు: స్థానిక ఎస్‌ఈబీ స్టేషన్ పరిధిలో వివిధ సారా కేసుల్లో పట్టుబడిన వాహనాలను స్టేషన్ ఆవరణలో వచ్చే నెల 5న బహిరంగ వేలం వేస్తామని నిడదవోలు ఎస్‌ఈబీ సీఐ కె.వీరబ్రహ్మం శనివారం తెలిపారు. నాలుగు ద్విచక్ర వాహనాలు, రెండు ఇంజిన్ పడవలకు వేలం వేస్తామన్నారు. వేలంలో పాల్గొన దలచిన వారు ముందుగా రూ.5,000 ధరావత్తు చెల్లించాలన్నారు. వేలంలో వాహనాలు దక్కించున్న వారు పాట సొమ్ముకు అదనంగా 18 శాతం జీఎస్టీ చెల్లించాలన్నారు.

29,30 తేదీల్లో కొవ్వూరులో క్యాంపస్ ఇంటర్వ్యూలు

కొవ్వూరు: పట్టణంలోని ఏబీఎన్, పీఆర్ఆర్ కళాశాలలో బహుళ జాతి కెమికల్ కంపెనీ లారస్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో ఎమ్మెస్సీ ఆర్గానిక్ అండ్ అనలైటికల్ విద్యార్థులకు ఈ నెల 29,30 తేదీల్లో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీ సుబ్బారావు శనివారం తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరంలో ఎం ఫార్మసీ, బీ ఫార్మసీ, డిప్లొమో మెకానికల్, ఎలక్ట్రికల్ చదవిన వారికి, బీఎస్సీ పాసైన వారికి మౌఖిక పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఉదయం పది గంటల నుంచి ఈ ఇంటర్వ్యూలు ప్రారంభం అవుతాయని, అభ్యర్థుల అర్హతను బట్టి క్యూసీ, క్యూఏ, ఏఆర్ అండ్ డీ విభాగాల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయని చెప్పారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే విద్యార్థులు తమ బయోడేటాతో పాటు రెండు పాసుపోర్టు సైజు ఫొటోలు, అన్ని విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్సులను వెంట తీసుకురావాలన్నారు. ఇతర వివరాల కోసం 73372 52890, 81439 34748,98664 08009 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బస్ స్టేషన్లలో దుకాణాల ఏర్పాటుకు టెండర్ల ఆహ్వానం

కొవ్వూరు: ఆర్టీసీ డిపో పరిధిలోని నల్లజర్ల, కొవ్వూరు బస్సు స్టేషన్లలో స్టాల్స్, షాపులు ఏర్పాటు చేసుకునేందుకు, ఖాళీ స్థలాల్లో వ్యాపారాలు చేసుకునేందుకు ఆసక్తి కలిగిన వారి నుంచి సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్టు ఆర్టీసీ కొవ్వూరు డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ శనివారం తెలిపారు. ఈ నెల 29 నుంచి జూన్ మూడో తేదీ సాయంత్రం 5 గంటల లోగా డిపో మేనేజర్ కార్యాలయంలో టెండర్ ఫారాలు పొందవచ్చన్నారు. పూర్తి చేసిన టెండర్లను జూన్ ఐదో తేదీ ఉదయం పదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సీలు వేసిన టెండర్ల బాక్సులో వేయాలన్నారు. అదే రోజు మధ్యాహ్నం మూడు గంటలకు టెండరుదారుల సమక్షంలో టెండర్లను తెరుస్తామన్నారు.

నిడదవోలులో..

నిడదవోలు: స్థానిక ఆర్టీసీ బస్ డిపోలో అద్దెకు రెండు స్టాల్స్ నిర్వహించుకోవడానికి ఆసక్తి గల వ్యాపారుల నుంచి టెండర్లను ఆహ్వానిస్తున్నట్టు డిపో మేనేజర్ బి.శ్రీరామ్‌కుమార్ తెలిపారు. నెలవారీ అద్దె చెల్లించే పద్ధతిలో వ్యాపారం చేసుకునే వారు డిపో కార్యాలయంలో ముందుగా రూ.15 వేల ధరావత్తు సొమ్ము చెల్లించాలన్నారు. టెండర్లు దక్కించుకున్న వ్యాపారులు సీఎస్‌టీ 18 శాతం సొమ్ము కట్టాన్నారు. ఆర్టీసీ డిపో కార్యాలయంలో టెండర్ల ఫారాలు అందుబాటులో ఉన్నాయన్నారు. జూన్ 3న సీల్డు కవర్‌లో వచ్చిన టెండర్లను బహిరంగంగా నిర్వహిస్తామని డిపో మేనేజర్ శ్రీరామ్‌కుమార్ తెలిపారు.

అన్న సమారాధన

చాగల్లు: బ్రాహ్మణగూడెంలోని అంజనేయస్వామి వారి ఆలయ ప్రాంగణంలో శనివారం సాయంత్రం భారీ అన్న సమారాధన జరిగింది. స్వామివారి జయంతి ఉత్సవాల ముగింపులో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు.

క్లుప్తంగా

అన్నవరప్పాడులో భక్తుల రద్దీ



వేంకటేశ్వరస్వామికి హారతి ఇస్తున్న అర్చకుడు

పెరవలి: శనివారం కావడంతో మండలంలోని అన్నవరప్పాడు గ్రామంలోని వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తులు భారీగా తరలి వచ్చారు. వేకువ జాము నాలుగు గంటలకే స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించిన అనంతరం భక్తుల దర్శనానికి అర్చకులు అనుమతించారు. ఉదయం ఏడు గంటలకు మొదలైన భక్తుల తాకిడి మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగింది. దూరప్రాంత భక్తుల సౌకర్యార్థం దాతలు ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. దర్శనం చేసుకున్న భక్తులకు పులిహోర పంపిణీ చేస్తున్నామని ఆలయ ఈఓ రాధా కృష్ణ చెప్పారు.

పాక దగ్ధమై పశువులకు గాయాలు



మంటల్లో గాయపడిన పశువులను పరిశీలిస్తున్న ఏడీ డాక్టర్ రాధాకృష్ణ

చాగల్లు: మండలంలోని గౌరిపల్లి గ్రామ శివార్లలోని పంట పొలాల్లో గుంటి నాగేశ్వరరావు అనే రైతుకు చెందిన పశువుల పాక శనివారం తెల్లవారుజామున పూర్తిగా దగ్ధమైంది. ఈ మంటల్లో చిక్కుకున్న ఒక ఆవు, ఒక గేదెలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ రెండు పశువులకు మండల పశువైద్యాధికారి యు.ముఖేష్ వైద్యసేవలు అందించారు. కొవ్వూరు డివిజన్‌పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకుడు డాక్టర్ జి. రాధాకృష్ణ పశువులను పరిశీలించి తగు వైద్య సూచనలు చేశారు. అనంతరం రైతుతో మాట్లాడి పశువులకు పోషకాహారం అందించారు.

నిర్మాణాలు వేగవంతం చేయాలి



కాపవరం జగనన్న లే అవుట్‌లో లబ్ధిదారులతో ఎంపీడీవో రమేష్

పెరవలి: త్వరగా గృహ నిర్మాణాలు పూర్తి చేసేందుకు సచివాలయ సిబ్బంది తమ వంతు కృషి చేయాలని ఎంపీడీఓ రమేష్ సూచించారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా మండలంలోని కాపవరంలోని గృహ లబ్ధిదారులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం ఇసుక, ఐరన్, సిమెంటు, గుమ్మాలు, కిటికీలు ఉచితంగా ఇస్తున్నా గృహ నిర్మాణాలు పూర్తి కాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. వలంటీర్లు తమ పరిధిలోని లబ్ధిదారులతో మాట్లాడి గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. కాపవరం గ్రామానికి 58 గృహాలు మంజూరవగా ఇప్పటి వరకూ 35 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. మిగిలిన 23 నిర్మాణాలు చేపట్టవలసి ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బంటుమిల్లి రత్నాజీ రావు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



రైతులకు ట్రాక్టర్ అందిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: రైతు సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా రాయితీపై మంజూరైన ట్రాక్టర్‌ను ధన కొండమ్మ తల్లి కస్టమ్ హైరింగ్ సెంటర్ సభ్యులకు అందజేశారు. పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద శనివారం ఈ కార్యక్రమం జరిగింది. చాగల్లు మండలంలోని నందిగంపాడు గ్రామ రైతులకు రూ.15 లక్షల విలువైన ట్రాక్టర్‌తో పాటు, మూడు కృషి ట్రాక్టర్లను మంజూరు చేశారు. వాటిని నలభై శాతం రాయితీ కింద రూ.6 లక్షల సబ్సిడీపై అందించారు. పలువురు నందిగంపాడు రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

నిడదవోలు రూరల్: పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ నిడదవోలు మండల శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జిల్లా అధ్యక్షుడు రామ కృష్ణ గౌడ్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. జీడిగుంటలో జరిగిన కార్యక్రమంలో మండల శాఖ నూతన అధ్యక్షుడిగా ఎ.రమేష్, కార్యదర్శిగా టి.రవి, ఉపాధ్యక్షురాలిగా కృష్ణకుమారి, సంయుక్త కార్యదర్శిగా వి.చంద్రం, కోశాధికారిగా టి.జయరామ్ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో పీఎంపీ రాష్ట్ర యాక్షన్ కమిటీ చైర్మన్ ఎస్.కోటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మలపల్లి శ్రీనివాస్, కోశాధికారి మల్లేశ్వర రావు, నాయకులు ఎస్‌వీ కృష్ణారావు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో శనివారం ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు. ఉదయం నిర్వహించిన ఫస్టియర్ గణితం, జువాలజీ, హిస్టరీ, వొకేషనల్ పరీక్షలకు 86 మంది హాజరు కావాల్సి ఉండగా, 68 మంది మాత్రమే హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్, పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ పి.గౌరీనాథ్ తెలిపారు. అలాగే మధ్యాహ్నం నిర్వహించిన ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 34 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 30 మంది హాజరైనట్టు తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద తాళ్లపూడి కరిబండి గనిరాజు సూర్యకుమారి జూనియర్ కళాశాల, తాళ్లపూడి ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులు, అన్నదేవరపేట జెడ్పీ ఉన్నత పాఠశాల ఇంటర్ విద్యార్థులు, వేగేశ్వరపురం కళాశాల విద్యార్థులు పరీక్షలు రాశారు.

వైద్యానికి ఆర్థిక సాయం

దేవరపల్లి: బ్రెయిన్ వ్యాధితో బాధపడుతున్న దేవరపల్లికి చెందిన రాఘవరాజు బాలాజీ భార్య వైద్యం కోసం స్థానిక టి–ముకుంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. ఆ సంస్థ వ్యవస్థాపకుడు తంగెళ్ల సుబ్రహ్మణ్యం శనివారం రాత్రి రాఘవరాజు బాలాజీకి రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. రాఘవరాజు బాలాజీ భార్య బ్రెయిన్ వ్యాధితో బాధపడుతూ ఇటీవల ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు.

కొండ వాగు ముంపు నుంచి కాపాడండి

- ఎమ్మెల్యేకు నల్లజర్ల 2,3 వార్డు వాసుల వినతి
- గ్రామంలో 'తలారి' గడప గడపకూ..



నల్లజర్లలో మహిళకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నల్లజర్ల: రక్షిత అటవీ ప్రాంతం నుంచి ప్రవహించే కొండ వాగు తమ కాలనీని ముంచెత్తుతోందని నల్లజర్ల 2,3 వార్డుల ప్రజలు వాపోయారు. ఈ సమస్యను పరిష్కరించాలని శనివారం సాయంత్రం తమ వార్డుల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావును వారు కోరారు. సర్పంచ్ పల్లి జ్యోతి, ఉప సర్పంచ్ రాయుడు విజయకుమార్, వైస్ ఎంపీపీ ఆరుగొల్లు మణి, ఎంపీటీసీ సభ్యురాలు మేణ్ణి వెంకటలక్ష్మి , వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కండెపు రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. రిజర్వు ఫారెస్టుకు ఎగువన భారీ వర్షాలు కురిస్తే రాత్రికి రాత్రే కొండ వాగు తమ కాలనీని ముంచెత్తుతోందని వివరించారు. ఎన్నో ఏళ్ల క్రితం వేసిన విద్యుత్తు స్థంభాల వైర్లు ఇళ్లపైకి వస్తున్నాయని, ప్రమాదాలు జరగకముందే వాటి స్థానంలో కొత్త స్థంబాలు వేయాలని, లో వోల్టేజీ సమస్య పరిష్కరించాలని కోరారు. ఎస్సీ కాలనీకి ఎదురుగా ఉన్న ప్రధాన రహదారి పక్క డ్రైనేజీ ఏర్పాటు చేయాలని, సీసీ రహదారులు వేయించాలని, ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పలువురు కోరారు.ఆయా సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. నాలుగేళ్ల పాలనలో జగన్ ప్రభుత్వం అందించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వివరించే బుక్‌లెట్‌లను ఇంటింటా అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిశోర్‌కుమార్, ఎంపీడీఓ జోగేశ్వరరావులతో పాటు వివిధ శాఖల అధికారులు, పార్టీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, నల్లజర్ల, పోతవరం సొసైటీల అధ్యక్షులు కారుమంచి రమేష్, పెండ్యాల హరేరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో వలంటీర్లు కీలకం

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- ఉండ్రాజవరంలో వలంటీర్లకు వందనం



ఉండ్రాజవరంలో పురస్కారాలు పొందిన వలంటీర్లతో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

ఉండ్రాజవరం: సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేరవేయడంలో వలంటీర్లదే కీలక పాత్ర అని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. స్థానిక సుదీంద్ర బాబు కల్యాణ మండపంలో శనివారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ వలంటీర్లను తమ కుటుంబ సభ్యులుగా పింఛనుదారులు భావిస్తున్నారన్నారు. సేవలందుకుంటున్న లబ్ధిదారులే వలంటీర్లను అభినందిస్తున్నారని, మరన్ని సేవలందించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని సూచించారు. మొదటి విడతగా మండలంలోని వేలివెన్ను, కాల్దారి, పసలపూడి, చిలకపాడు, సూర్యారావుపాలెం, వడ్లూరు, సత్యవాడ గ్రామ సచివాలయ వలంటీర్లను సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలతో ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, వైస్ ఎంపీపీలు నరహరిశెట్టి సరోజిని, చెట్టే నవీన్, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు షేక్ షాజహాన్, కొఠారు సత్యనారాయణ, నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, కఠారి సిద్ధార్థరాజు, ఎంపీడీఓ ఎ. శ్రీనివాసు, ఈఓపీఆర్డీ ముత్యం వీరాస్వామి నాయుడు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.